క్లుప్తంగా

ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం


డ్రెయినేజీని శుభ్రం చేస్తున్న సిబ్బంది

నిర్మల్‌టౌన్: వర్షాకాలంలో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జిల్లా కేంద్రంలోని రవినగర్, శాస్త్రినగర్‌లో డ్రెయినేజీలు నిండి రోడ్డుపై చేరింది. శనివారం ఆయా కాలనీల్లో మున్సిపల్ చైర్మన్ పర్యటించారు. దగ్గరుండి సిబ్బందితో డ్రెయినేజీలు శుభ్రం చేయించారు. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి


మాట్లాడుతున్న గంగన్న

లక్ష్మణచాంద: రైతు భరోసా నిధులు వెంటనే విడుదలతోపాటు రుణమాఫీ చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ పార్టీ, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.గంగన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో రైతులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు వారాలు గడుస్తున్నా రైతు భరోసా నిధులు విడుదల కాకపోవడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుల పంటలకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలన్నారు. సమావేశంలో రైతులు పోశెట్టి, ముత్తన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి పరిశీలన


పరిశీలిస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి స్వప్న ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు శనివారం కూలిన ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అనిల్, ప్రధాన కార్యదర్శి అల్లూరి రాజు, ఉపాధ్యక్షులు నాగుల లింగం, ఏలేశ్వరం గంగాధర్ తదితరులు ఉన్నారు.

'అరెస్టు అప్రజాస్వామికం'


మాట్లాడుతున్న వాగ్మారే మహేందర్

నిర్మల్‌చైన్‌గేట్: నీట్ పరీక్షల్లో అన్యాయానికి గురైన విద్యార్థులకు న్యాయం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలిపిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని భగత్‌సింగ్‌భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలతో విద్యార్థులు రోడ్డెక్కితే కేంద్రం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నీట్‌పరీక్ష మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన నాయకులను భేషరతుగా విడుదల చేయాలన్నారు. వినోద్, పవన్, ధ్రువ, అరుణ్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘ భవనానికి నిధులు


ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న నాయకులు

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామ ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.1.50 లక్షల మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని శనివారం సంఘ సభ్యులకు అందజేశారు. మాజీ సర్పంచ్ కొత్తపల్లి బుచ్చన్న, లక్ష్మి-రమేశ్, ఎంపీటీసీలు మధుకర్, చంద్రకాంత్, వీడీసీ చైర్మన్ అశోక్, రాజన్న, రవి, విఠల్‌రావు, లింగారెడ్డి, సాయన్న పటేల్, రాములు, భోజన్న, భూషణ్ పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులను వాడొద్దు

కుంటాల: పంటల సాగులో రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని ఏఈవో గణేశ్ సూచించారు. విఠాపూర్‌లో రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఎరువుల యాజమాన్యం, పత్తిని ఆశించే పురుగులు, నివారణ చర్యల గురించి వివరించారు. రైతులు సాయారెడ్డి, చిన్నారెడ్డి ఉన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు


అద్దెభవనంలో పిల్లల భోజనాలు

- ముధోల్ ప్రాజెక్టు పరిధిలో 180 కేంద్రాలు
- ఇరుకు గదుల్లోనే 77 కేంద్రాల నిర్వహణ
- అరకొర వసతులతో ఇబ్బంది

లోకేశ్వరం: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సొంత భవనాలు లేక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె ఇళ్లల్లో కేంద్రాల నిర్వహణ సాగుతోంది. ఇరుకు గదులు, అరకొర వసతులతో నెట్టుకురావాల్సిన పరిస్థితి. కేంద్రాల్లో పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు సేవలందించాలి. పిల్లలకు టీకా ఇవ్వడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం తదితరాలు ఇక్కడే చేయాల్సిన పరిస్థితి. అద్దె ఇంట్లో వీటి నిర్వహణ కష్టంగా మారుతోంది. చిన్నారులకు భోజనం పెట్టాలన్నా ఇబ్బందిగా మారింది. ప్రతినెల నిధులు ప్రభుత్వం సకాలంలో విడుదల చేయడం లేదు. దీంతో టీచర్లే ఆ భవనాలకు రూ.వెయ్యి అద్దె చెల్లించాల్సి వస్తుంది. అయితే సాధారణంగా ఒక కేంద్రం నిర్వహణకు (వంట చేసేందుకు, పిల్లలు కూర్చునేందుకు, సామగ్రి నిల్వకు) గదులుండాలి. క్షేత్రస్థాయిలో ఎక్కడా ఈ సౌకర్యం లేదు.


ధర్మోరలో అంగన్‌వాడీ కేంద్రం అద్దె ఇల్లు ఇదే

ముధోల్ ప్రాజెక్టు పరిధిలో..

ముధోల్ ప్రాజెక్టు పరిధిలో 180 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 37 చోట్ల సొంత భవనాలు ఉండగా, మరో 55 ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదుల్లో కొనసాగుతున్నాయి. 11 కేంద్రాలు ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగుతున్నాయి. మిగతా 77 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహణ సాగుతోంది.

పెరుగనున్న హాజరుశాతం

ప్రీ ప్రైవేటు విద్య అందుబాటులో ఉండటంతో పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తున్నారు. చిన్నారులను స్కూళ్లకు అలవాటు పడేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తున్నారు. తొలుత అంతంత మాత్రమే ఉన్న హాజరుశాతం ఇప్పుడు 90 శాతానికి చేరనుందని అధికారులు చెబుతున్నారు.

పిల్లల అల్లరి తగ్గింది


పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడంతో ఇంటి వద్ద పిల్లల అల్లరి తగ్గింది. పిల్లలకు పాటలు, పద్యాలు అక్షరాలను కేంద్రాల్లో చక్కగా నేర్పుతున్నారు. చిన్నారులను ఉదయన్నే కేంద్రాలకు పంపిస్తున్నాం.
– సాయవ్వ, బామ్నికే

నిధులు మంజూరు చేయాలి


అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు లేవు. టీచర్లు, పిల్లలకు ఇబ్బంది ఉంది. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి కేంద్రాలకు భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టాలి.
– వరహాణ, మండల అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు

ప్రతిపాదనలు పంపాం


అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు అవసరం ఉన్న చోట గుర్తించి నిధుల మంజూరు కోసం ఏటా ప్రతిపాదనలు పంపిస్తున్నాం. నిధులు మంజూరైతే భవనాల నిర్మాణాలు చేపట్టవచ్చు. అద్దె భవనాల్లో ఒక్కో కేంద్రానికి నెలవారీ అద్దె ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రూ.వెయ్యి చెల్లిస్తున్నాం.
– శ్రీమతి, ముధోల్ ప్రాజెక్టు సీడీపీవో

బాధిత కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్

నర్సాపూర్(జి): మండలంలోని నందన్ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాదవ్ రవికిరణ్ తండ్రి జాదవ్ గంగాధర్ పటేల్ (రిటైర్డ్ టీచర్) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట శంకర్ చంద్రే, భోజరాం పటేల్, సాహెబ్‌రావు, మోతిలాల్ పటేల్, సయ్యద్ కలీమ్ తదితరులు ఉన్నారు.

ఆలయాల ప్రహరీకి నిధులు

లోకేశ్వరం: మండలంలోని నగర్‌తండా, సేవాలాల్ తండా గ్రామాల్లో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయాల ప్రహరీ నిర్మాణానికి ఒక్కో వాటికి ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.3 లక్షల నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్‌ను శనివారం భైంసాలోని ఆయన నివాసంలో తండావాసులు సన్మానించారు. నగేశ్, భీంరావు, గణేశ్, భోజారాం, కైలాస్, జీవన్, నవీన్, గంగారాం, రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

గ్రామాల శుభ్రత పాటించాలి


పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

తానూరు: గ్రామాల శుభ్రత పాటించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. మండలంలోని దౌలతాబాద్ గ్రామంలో శనివారం పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి ఎరువుల తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చి గ్రామస్తులకు క్లోరినేషన్ చేసిన నీటిని అందించాలన్నారు. పల్లె ప్రకృతివనం పరిశీలించి మొక్కలను సంరక్షించాలన్నారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణ, ప్రభుత్వ స్థలాలు, రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎంపీవో మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

పూరీ జగన్నాథ స్నానయాత్ర

కుంటాల: కుంటాలలోని ప్రాచీన శ్రీకృష్ణ ఆలయంలో శనివారం పూరీ జగన్నాథ పాదయాత్ర స్నానయాత్ర ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణునికి మంగళస్నానం, పంచామృతంతో అభిషేకం, ప్రత్యేకంగా కిచిడితో నైవేద్యం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. అర్చకుడు రామానుజదాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా..

బాసర: బిద్రల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ది ఫ్లో ఆఫ్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు, బాసర వాసి ప్రశాంత్ ముందుకొచ్చారు. మృతుడి కుమార్తె చదువుకు సంబంధించి అన్ని సదుపాయలు కల్పిస్తామన్నారు. శనివారం ఆమెకు స్కూల్ ఫీజు చెల్లించి యూనిఫాం అందించారు.

భారీ వర్షం

లక్ష్మణచాంద/ఖానాపూర్: లక్ష్మణచాంద, ఖానాపూర్‌లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వర్షం కురిసింది. తొలకరి కోసం చూస్తున్న రైతులకు వర్షాలు కొంత ఉపశమనం కలిగించింది. ఖానాపూర్‌లో 26 మి.మీ వర్షపాతం నమోదైంది.

అన్నదానం

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ రేణుకమాత ఆలయంలో శనివారం ముధోల్ గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గౌడ కులస్తులు ఎల్లమ్మ విగ్రహానికి పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. సభ్యులు కార్తీక్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అంజిగౌడ్, మురళీగౌడ్,సాయిబాబాగౌడ్, తిరుపతిగౌడ్, దత్తాత్రిగౌడ్, గంగాధర్‌గౌడ్ ఉన్నారు.

వర్షం కురవాలని పూజలు

కుంటాల: వర్షం కురవాలని కోరుతూ మండలంలోని ఓలా గ్రామంలో రైతులు శనివారం పూజలు నిర్వహించారు. గోదావరి నది జలాలతో హనుమాన్ ఆలయంలో అభిషేకించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. అనంతరం రైతులందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

మొక్కలు నాటిన భక్తులు

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ గ్రామంలోని నారాయణగుట్ట రాజ్యలక్ష్మి సాహిత లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ ఆవరణలో శనివారం భక్తులు మొక్కలు నాటారు. ప్రతీరోజు మొక్కలు నీరందిస్తామని తెలిపారు. అర్చకుడు నరసింహస్వామి, భక్తులు ఉన్నారు.

రాజూర పాఠశాలకు బదిలీ చేయండి


లోకేశ్వరం: కుంటాల మండలం పెంచికల్‌పాడ్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం ఎల్లన్నను లోకేశ్వరం మండలం రాజూర ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేయాలని వీడీసీ సభ్యులు కోరారు. నిర్మల్‌లో డీఈవో రవీందర్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాణారావు తదితరులు ఉన్నారు.

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ


మోహన్‌రావు

లోకేశ్వరం: లోకేశ్వరం నూతన ఎస్సైగా మోహన్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కొంత కాలంగా పనిచేసిన ఎస్సై రాజు బదిలీపై నిజామాబాద్ వెళ్లారు. ముథోల్ ఎస్సై మోహన్‌రావును ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

తప్పిన ప్రమాదం



ముధోల్: మండల కేంద్రంలోని నయాబాదిలో బాసర–భైంసా రోడ్డు ఆనుకొని ఉన్న శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి గద్దెపై నుంచి ట్రాన్స్‌ఫార్మర్ కిందపడింది. రాత్రి వేళ కావడంతో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రమాదం తప్పింది. శనివారం విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేశారు.





కంపుకొడుతున్న మార్కెట్

జిల్లాకేంద్రంలోని గాంధీ కూరగాయల మార్కెట్ అపరిశుభ్రతగా మారింది. రోడ్డుపై చెత్తాచెదారం మధ్యనే వ్యాపారులు విక్రయిస్తున్నారు. కుళ్లిన కూరగాయలను ఇష్టారీతిన పడేస్తున్నారు. వర్షం కురిస్తే చాలు మార్కెట్ మొత్తం చిత్తడిగా మారి కంపుకొడుతుంది. వినియోగదారులు ముక్కుమూసుకుని వచ్చి కూరగాయలు కొనే పరిస్థితి. మార్కెట్‌లో రోజూ శుభ్రం చేయాల్సి ఉన్నా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

సోన్‌లో సామాజిక తనిఖీ ప్రజావేదిక


పాల్గొన్న డీఆర్‌డీఓ విజయలక్ష్మి, అధికారులు

సోన్: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో విజిలెన్స్ బృందం ఆధ్వర్యంలో శనివారం 3వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఆర్‌డీవో విజయలక్ష్మి హాజరయ్యారు. ముందుగా అన్ని గ్రామాల్లో 15 రోజులుగా కొనసాగిన సామాజిక తనిఖీలకు సంబంధించిన వివరాలను తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరానికి రూ.3.93 కోట్లతో వివిధ పనులు చేపట్టారని తెలిపారు. ఉపాధి కూలీలకు సంబంధించిన పనుల వివరాలను ఏపీవో మంజుల, పంచాయతీ కార్యదర్శులు డీఆర్‌డీవోకు వివరించారు. ఉపాధి పనుల్లో అధికారుల సమన్వయం లోపం వెల్లడైందని డీఆర్‌డీవో పేర్కొన్నారు. రూ.1770 నగదు రికవరీ చేయాలన్నారు. రూ.40 లక్షలకు సంబంధించిన సీసీ రోడ్డు పనుల వివరాలను అధికారులు ఇవ్వలేదని తెలిపారు. ఉపాధి పనుల్లో ఇక నుంచి చేపల చెరువులు, ఇంకుడు గుంతలు, చెక్‌డ్యామ్‌లు, ఉద్యానవనాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డీఆర్‌డీవోని అధికారులు సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ మానసరెడ్డి, ఎంపీడీవోలు సురేశ్, మోహన్‌రెడ్డి, ఉషారాణి, ఎంపీవో కలీల్ హైమద్, హెచ్ఆర్ ఎం.సుధాకర్, విజిలెన్స అధికారులు సాయిలు, నవీన్, లక్ష్మణ్, కార్యదర్శులు, టీఏ లక్ష్మణ్, ఎఫ్ఏ సంధ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు నడపాలని వినతి


డిపో మేనేజర్‌కి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సాపూర్(జి): మండలంలోని నందన్, బామ్ని, అంబకంటి గ్రామాల మీదుగా కుంటాల వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ యువ నాయకుడు దేవేందర్ శనివారం నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డికి వినతిపత్రం అందజేశారు. సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి, తాండ్ర, ధోనిగాం, తిమ్మాపూర్(జి) గ్రామాల మీదుగా గొల్లమాడ వరకు అదనంగా మరో బస్సు నడపాలని సారంగాపూర్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సురేందర్ వినతిలో కోరారు. గ్రామాల్లో ప్రతీరోజు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో దరువు భోజన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి


డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు, అధికారులు

ఖానాపూర్: పట్టణంలోని పాత బస్టాండ్‌లోని ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ శనివారం ఎంఈవో మధుసూదన్, కాంప్లెక్స్ హెచ్ఎం సంధ్యారాణితో కలిసి కాలనీవాసులు డీఈవో రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో ఈ విషయమై కలిశారు. ఇటీవల పాఠశాలను పునఃప్రారంభించడం ద్వారా 30 మందికిపైగా విద్యార్థులు పాఠశాలలో నూతనంగా ప్రవేశాలు పొందినట్లు తెలిపారు. తల్లిదండ్రుల విన్నపం మేరకు పాఠశాలలో రెండు పోస్టులు కేటాయించేలా చూస్తామని డీఈవో హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

బండి సంజయ్‌ను కలిసిన జిల్లా నాయకులు


పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా నాయకులు

భైంసాటౌన్: జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు శనివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిశారు. కరీంనగర్‌లోని ఆయన నివాసంలో ఈమేరకు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కేంద్రమంత్రిగా నియమితులైన నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాజేశ్వర్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, గంగారెడ్డి, రవి పాండే, గోపాల్‌సర్దా, తాడేవార్ సాయినాథ్ ఉన్నారు.

పంచాయతీ ట్రాక్టర్ దుర్వినియోగంపై ఫిర్యాదు

సారంగపూర్: మండలంలోని కంకెట పంచాయతీ ట్రాక్టర్‌ను ఓ ప్రైవేటు కాంట్రాక్టర్ పనికోసం వినియోగించారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన పలువురు శనివారం ఎంపీవో తిరుపతిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తుడు రాజేశ్వర్ మాట్లాడుతూ తమ గ్రామంలో ఇటీవల ఓపార్టీకి చెందిన కాంట్రాక్టర్ సీసీరోడ్డు నిర్మించారని అన్నారు. అయితే సదరు సీసీరోడ్డు నిర్మాణానంతరం దానికి ఇరువైపులా మొరం వేయాల్సి ఉందన్నారు. అయితే సీసీరోడ్డుకు రెండువైపులా మొరం వేయించడానికి ట్రాక్టర్‌ను వినియోగించారని ఆరోపించారు. ఈవిషయమై సంబంధిత కార్యదర్శిని వివరణ కోరగా పంచాయతీ ఎదుట వర్షపు నీరు నిలిచిపోయి ఇబ్బందులు ఏర్పడుతున్నందున సిబ్బందితో కొంత మేర మొరం తెప్పించి పోయించామన్నారు. ఏ సీసీ రోడ్డుకు తాము మొరం వేయలేదని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీచర్లు

ఖానాపూర్: ఖానాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆరు మండలాలకు చెందిన టీచర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, టీచర్లు, సిబ్బందిపై కొందరు నాయకులు వార్త పత్రికల్లో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా, రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ శివరాజ్‌తోపాటు పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. సూపర్‌వైజర్లు, టీచర్లు, తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. చెత్త తొలగించరూ..



కుభీర్: మండల కేంద్రంలోని గ్రామైక్య సంఘం వద్ద చెత్తను పేరుకుపోతుంది. దుర్వాసనతో పలువురు ముక్కుమూసుకుంటున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా చెత్త వేస్తున్నారు. అధికారులు పట్టించుకుని చెత్త తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– అధికారి: విజయ్, ఈవో కుభీర్, సెల్: 73969 16252

ఆల్బెండజోల్ మాత్ర పంపిణీ

కుంటాల: మండల కేంద్రంలోని సృజన విద్యానిలయం పాఠశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ కొత్తకాపు గంగన్న శనివారం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఆశ కార్యకర్తలు మమత, దేవకి, విజయ, లక్ష్మి పాల్గొన్నారు.